విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలగకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఏఈ రాం బాబు తెలిపారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలో విద్యుత్ సమస్యలపై క్షేత్ర పరిశీలన చేశారు. వినియోగదారులకు విద్యుత్ అసౌకర్యం, అంతరాయం కలిగితే కంట్రోల్ / ఫ్యూస్ ఆఫీస్ కాల్ సెక్షన్ సెల్ నెంబర్ 9490153566, విద్యుత్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 సంప్రదించాలన్నారు. మరింత మెరుగైన సేవలకు 9440813164,9440813144.

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది : సీపీఎం



మేడ్చల్‌రూరల్: నల్లగొండ జిల్లాలో 2018లో జరిగిన పరువుహత్య కేసులో న్యాయం గెలిచిందని, నల్గొండ జిల్లా కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి నరేష్ తెలిపారు. మేడ్చల్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్ పరువుహత్య కేసులో న్యాయస్థానం ఆరుగురికి జీవిత ఖైదు విధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రణయ్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. మండల కమిటీ సభ్యులు కొమురయ్య, రమేష్, నర్సింగ్‌రావు, ప్రశాంత్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



మేడిపల్లి: ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పరిధిలోని శ్రీకృష్ణానగర్ పీర్జాదిగూడలో నివాసం ఉంటున్న నేతల నారాయణ మూర్తి కుమారుడు జాషువా (15) గత కొద్ది రోజులుగా సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి సోమవారం రాత్రి 8.00 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

మేడిపల్లి: పూణేలో ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఈనెల 9న చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మేడిపల్లిలోని బుద్దానగర్‌లో నివసించే శ్రీనివాస్ కుమారుడు సందీప్(24) పూణేలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 9న ఇంటికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు ఫోన్ చేయగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని తన స్నేహితుల వద్దకు వెళ్తున్నానట్లు చెప్పాడు. తిరిగి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ‘బేజారు’!



ఘట్‌కేసర్‌లో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

రైతుబజార్ కోసం దశాబ్ద కాలంగా ఎదురుచూపులు

- రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

ఘట్‌కేసర్: దశాబ్దకాలంగా రైతులు, పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న రైతు బజారు ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. పట్టణంలోని మెయిన్‌రోడ్డు, అంబేడ్కర్‌నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, కరీంగూడ రోడ్డు, గురుకుల్ కళాశాల ఎదుట, ఎన్ఎఫ్‌సీనగర్‌లో రోడ్లపై ప్రతివారం జరిగే సంతలో రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుంటారు. సంతరోజుల్లో క్రయవిక్రేతలతో రోడ్లపై అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూరగాయలతో పాటు నిత్యవసర వస్తువులు తక్కువ ధరకు లభిస్తుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు రైతుబజార్‌ను కోరుకుంటున్నారు.

సంతలతో ప్రమాదాలు...

రైతు సేవా సహకార సంఘం సమీపంలోని ప్రభుత్వ భూమిలో గతంలో రైతుబజారు ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ అక్కడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించడంతో తిరిగి సమస్య మొదటికి వచ్చింది. రైతులు పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి ప్రత్యేక స్థలం లేకపోవడంతో వారిని దళారులు ఆశ్రయిస్తున్నారు. ప్రత్యేక స్థలం లేకపోవడంతో క్రయవిక్రయాల సమయంలో గతంలో ప్రమాదాలు జరిగాయి. ఓ కారు వేగంగా వచ్చి కూరగాయలు విక్రయించే వ్యక్తిని ఢీ కొట్టగా అతడి కాలు విరిగింది.

అధిక ధరలకు దళారుల విక్రయం..

దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు ఇక్కడ అమ్ముతుంటారు. ఆరుగాళం కష్టపడి పండించిన కూరగాయలతో అన్నదాతల కంటే దళారులే అధికంగా సంపాదిస్తుంటారు. రైతుబజారు ఏర్పాటుతో మండలంలో రైతులు పండించిన కూరగాయలు తామే స్వయంగా విక్రయించుకునే అవకాశం లభిస్తుంది. తాజా, నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకు లభించడంతో పాటు రైతులకు గిట్టుభాటు ధర లభిస్తుంది. దీంతో రైతులు, వినియోగదారుల మధ్య ఉన్న దళారీ వ్యవస్థకు చెక్ పడుతుంది. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి పట్టణంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక స్థలం కేటాయించాలి...



రైతుబజారుకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతుబజారుకు స్థలం కేటాయించాలి.

– మంకయ్య, మర్పల్లిగూడ

ప్రమాదాలు జరుగుతున్నాయి...



సంత జరిగే శుక్రవారం రోజున ఘట్‌కేసర్ నుంచి ఎన్ఎఫ్‌సీనగర్‌కు వెళ్ల లేకపోతున్నాం. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి నెలకొంటోంది. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.

– రమాదేవిమహిపాల్‌గౌడ్, మాజీ కౌన్సిలర్

రైతులకు మేలు జరుగుతుంది...



రైతుబజారు ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుంది. వారు పండించిన కూరగాయలు స్వయంగా అమ్ముకునే అవకాశం లభిస్తుంది. దళారులు లేకపోవడంతో ఇటు రైతులకు లాభం వస్తుంది. అటు ప్రజలకు తక్కువ ధరలో తాజా కూరగాయలు లభిస్తాయి.

– బొక్క కృష్ణారెడ్డి, రైతు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో అక్రమ నిర్మాణాలను మంగళవారం అధికారులు కూల్చివేయించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 653, 672, 681,682 663లలోని ఓ వెంచర్ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ ల్యాండ్ పేరిట వెంచర్ నిర్మాణం చేయడంతో పాటు స్థలానికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి ఇతరులు లోపలికి వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేశారు. దీంతో పక్క పొలాల రైతులు ఇబ్బందులకు గురికావడంతో వారు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు సదరు వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో మంగళవారం ఎంపీఓ సునీత, గ్రామకార్యదర్శి ఉమాదేవి, శ్రీరంగావరం, కొనాయిపల్లి గ్రామ కార్యదర్శులు రమణారెడ్డి, ప్రశాంత్ ఘటనా స్థలాన్ని చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీపీ సాయంతో తొలగించారు.

బస్టాప్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



నాగారం, కుషాయిగూడ ప్రధాన రహదారి పక్కన కూల్చేసిన బస్‌స్టాప్



బస్‌స్టాప్ (ఫైల్)

కీసర: అనుమతులు లేకుండా నాగారం, కుషాయిగూడ ప్రధాన రహదారిలోని బస్‌స్టాప్‌ను తొలగించిన వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు చేపట్టాలని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సబితాఆంజనేయులుగౌడ్, అనితాసుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. నాగారం, కుషాయిగూడ ప్రధాన రహదారిలో విజయ ఆసుపత్రి సమీపంలో గత 25 ఏళ్ల క్రితమే ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో ఇక్కడ బస్‌స్టాప్ నిర్మించారన్నారు. గత 25 ఏళ్లుగా ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ బస్‌స్టాప్‌ను పక్కనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం రాత్రికి రాత్రే జేసీబీతో తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్‌స్టాప్‌ను తొలగించిన వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు చేపట్టడంతో పాటు తిరిగి అక్కడే నిర్మించేలా మున్సిపల్ అధికారులు సదరు ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు చేపట్టాలన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..!

మూడుచోట్ల దొంగతనాలకు పాల్పడిన దుండగులు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో మూడిళ్లలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎఫ్‌నగర్‌లో లక్ష్మీనగర్‌కు చెందిన గుండి గిరి ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో కలిసి ఓ వివాహానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి దుండగులు ఇంట్లో చొరబడి 3 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన పద్మావతి గ్రౌండ్ ఫ్లోర్‌కు తాళం వేసి ఒకటో అంతస్తులో నిద్రపోయింది. కింది ఫోర్షన్ తాళం పగులగొట్టినట్లు సమాచారం. సీ–2 కాలనీలో నివసించే విజయ్‌కుమార్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికొచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి అల్మారా పరిశీలించగా రెండు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



బాలరాజు (ఫైల్)

జవహర్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ ఇందిరమ్మ కాలనీలో నివసించే కె.బాలరాజు (55), భార్య బాలమణి కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 6న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇలాగే వెళ్లి రెండ్రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని భార్య బాలమణి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రెండోరోజుకు చేరిన దీక్ష



కీసర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంతవరకు నోటిఫికేషన్ల ఫలితాలను నిలిపేయాలన్న మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంచాల మహేందర్ అధ్యక్షతన రెండోరోజు మంగళవారం కీసరలో నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ సాయిబాబా దీక్షలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీవర్గీకరణ జరిగిన తర్వాతే గ్రూప్ 1,2,3 ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు తుడుం శ్రీనివాస్, శీలం మల్లేష్, మంచాల పెంటయ్య, సుజాత, బాలరాజ్, రవి, శ్రీశైలం, లక్ష్మణ్, మంచాల రాహుల్‌కృష్ణ, కర్రగణేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

కీసర: తెలంగాణ ఉమెన్స్ 2ౠ25 రోలింగ్ కప్ పేరిట నగరంలోని బోయిన్‌పల్లిలోని స్కైకింగ్ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో 13 మహిళాజట్లు, 150కి పైగా మహిళలు పాల్గొన్నారు. మంగళవారం కీసరలోని ఎంజేపీటీబీసీ డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ మేరకు టోర్నమెంట్‌లో ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ వనజాత అభినందించారు. ఏటీపీ గంగావతి, ఫిజికల్ డైరెక్టర్ బాబీ, అనిత, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో మేడ్చల్ మహిళకు 4 గోల్డ్ మెడల్స్



అవార్డు అందుకుంటున్న దివ్య సారిక

మేడ్చల్‌రూరల్ : అంతర్జాతీయ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన మహిళా బేకరీ చెఫ్ సత్తా చాటారు. పలు విభాగాల్లో పోటీల్లో పాల్గొని 4 గోల్డ్ మెడల్స్ సాధించింది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి గిర్మాపూర్‌కు చెందిన ఎంఎస్ దివ్యసారిక ఢిల్లీలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జరిగిన 17వ ఎడిషన్ ఇండియన్ క్యులినరీ ఆర్ట్ ఛాలెంజ్ పోటీల్లో పాల్గొంది. దాదాపు 800ల మందికి పైగా అంతర్జాతీయ చెఫ్‌లు ఈ పోటీలో పాల్గొనగా లైవ్ డిస్‌ప్లేల నుంచి లైవ్ ప్రెజెంటేషన్స్, లైవ్ కుకింగ్ వరకు దాదాపు 18 విభిన్న విభాగాలతో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బేకరీ చెఫ్‌గా ఎంఎస్ దివ్యసారిక ఉత్తమ ప్రతిభతో 4 బంగారు పతకాలు, 2 కాంస్య పతకాలను సాధించింది.

సకాలంలో పన్నులు చెల్లించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రజలు 2024–2025 సంవత్సరం ఇంటి పన్నులు చెల్లించాలని కమిషనర్ వసంత మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని, మొండి బకాయిలను వదిలిపెట్టబోమని, మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పన్నులు కట్టని ఇళ్లకు రెడ్ నోటీసులు జారీ చేస్తామని ఆమె హెచ్చరించారు.

దరఖాస్తుల పరిశీలన ముమ్మరం!

జిల్లాలోని 13 పురపాలికల్లో ఎల్ఆర్ఎస్‌కు 1.64 లక్షల దరఖాస్తులు

నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు

సమస్యల పరిష్కారానికి సమీపిస్తున్న నిర్దేశిత గడువు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో ఎస్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారానికి నిర్దేశించిన గడువు సమీపిస్తుండటంతో పరిశీలన కార్యక్రమంలో వేగం పెంచేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో పురపాలక సంఘాల అధికారులు కసరత్తును ముమ్మరం చేస్తున్నారు. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్ సహా పురపాలక సంఘాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. పురపాలక అధికారులు కూడా ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని పట్టణాల్లో ఈ ప్రక్రియ వేగవంతమైంది.

పరిష్కారమైన దరఖాస్తులు 86,374

13 పురపాలక సంఘాల పరిధిలో మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1,64,901 వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 86,374 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 78,527 దరఖాస్తులను ఈ నెలాఖరు వరకు పరిష్కరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజు రాయితీ గడువును పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పురపాలక సంఘం	మొత్తం దరఖాస్తులు	పరిష్కారమైనవి
నిజాంపేట	4,219	2,124
బోడుప్పల్	17,705	7,346
పీర్జాదిగూడ	9,652	4,463
జవహర్‌నగర్	330	174
ఘట్‌కేసర్	32,126	14,950
నాగారం	18,855	12,507
దమ్మాయిగూడ	21,956	11,426
పోచారం	20,991	9,941
దుండిగల్	15,088	8,708
తూముకుంట	9,182	5,842
గుండ్లపోచంపల్లి	3,035	2,066
కొంపల్లి	2,087	1,237
మేడ్చల్	9,675	5,590

శాఖల మధ్య సమన్వయానికి..

ఎల్ఎర్ఎస్ ప్రక్రియను పురపాలిక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు చేపట్టాల్సి ఉంటోంది. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా మొదటిదశలో మూడు శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించి జియోట్యాగింగ్ చేయాల్సి ఉంటోంది. రెండోదశలో టీపీవో పరిశీలించి రుసుం (ఫీజు) నిర్దేశిస్తారు. మున్సిపల్ కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పరిశీలన ప్రక్రియ పూర్తవుతోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పురపాలక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్లాట్ డాక్యుమెంట్లను పరిశీలించాలి. రెవెన్యూ అధికారులు ఆ ప్లాట్ వివాదంలో ఉందా.. కేసులు ఉన్నాయా.. ప్రభుత్వానిదా.. ప్రైవేటా.. అని నిర్ధారించాల్సి ఉంటోంది. చెరువులు, కుంటల పరిధిలో స్థలం ఉందా.. లేదా.. అనే విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయం కోసం కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసినప్పటికీనీ, తీవ్ర జాప్యం జరుగుతోందంటున్నారు. శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపం కారణంగా దరఖాస్తుల పరిశీలన జాప్యం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యం తమది కాదంటూ దాటవేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సెలవుల్లో ఉండటంతో మరో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి వస్తోంది. అదనపు బాధ్యతల వల్ల ఈ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది.

గ్రంథాలయాలను పటిష్టం చేస్తాం

శామీర్‌పేట్: గ్రంథాలయాలను పటిష్టం చేస్తామని మేడ్చల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా, శామీర్ పేట మండలం, అలియాబాద్‌లో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తిచేసి, పాఠకులకు అందుబాటులోకి తీసుకురానున్నామని, రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టిన స్కూటీ..

చికిత్స పొందుతూ మృతి



ఐలయ్య మృతదేహం

శామీర్‌పేట్: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్రవాహనం (స్కూటీ) ఢీ కొట్టిన ఘటనలో అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామానికి చెందిన బూస ఐలయ్య (60), మంగళవారం ఉదయం కరీంనగర్ , హైదరాబాద్ రాజీవ్‌రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో నగరం నుంచి సిద్దిపేట వైపు టీఎస్ 08 జీజే 2377 నంబరు గల ద్విచక్రవాహనం (స్కూటీ)పై వస్తున్న వ్యక్తి రోడ్డు దాటుతున్న ఐలయ్యను ఢీ కొట్టగా తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్రవాహనదారుడికి కూడా తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖోఖోకు ఆదరణ పెంచాలి



విద్యార్థులతో కళాశాల చైర్మన్ గౌతమ్‌రావు

ఘట్‌కేసర్: ఖోఖో క్రీడకు ఆదరణ పెంచాలని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) చైర్మన్ గౌతమ్‌రావు అన్నారు. ఇటీవల కళాశాలలో జరిగిన బాలికల ఖోఖో టోర్నీలో ప్రథమస్థానంలో నిలిచిన వీబీఐటీ బాలికల ఖోఖో క్రీడాకారులను మంగళవారం ఆయన సత్కరించి అభినందించారు. వారికి నగదుతో పాటు స్పోర్ట్స్‌కిట్‌ను అందజేశారు. వీబీఐటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఈఈఈ హెచ్‌ఓడీ నీలిమా, సివిల్ హెచ్‌ఓడీ రామకృష్ణ, ఈసీఈ హెచ్‌ఓడీ పూర్ణలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు వెంకటేష్, వినోద్, శివలాల్, పాషా, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

13న ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందని ప్రిన్సిపాల్ డా.కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఓ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోరారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రకటించారు. మరిన్ని వివరాలకు 9059823318.